


**నానా శ్రమపడి అడ్రసు వెతుక్కుని ఎండలో పడి వాడి ఆఫీసుకెళ్తే శంకర్రావు నన్ను రిసీవ్ చేసుకున్న తీరుచూస్తే గాలి తీసేసినట్లయింది.**

# కృతజ్ఞత

## తొత్తడి గణపతిరావు

'హలో గురూ! కమాన్ ఎక్కడ దిగావ్.? మొత్తానికి మా భాగ్యనగరం మీద నీకిన్నాళ్ళకు దయ కలిగిందన్న మాట-సంతోషం... చూడు నువ్వెక్కడ దిగినా సరే రేపు మా ఇంటికి తప్పకుండా రావాలి భోజనానికి' అంటూ గడ గడా మాట్లాడు తున్నాడు శంకరం.

'ఎప్పుడు హైదరాబాదొచ్చినా మా యింట్లోనే దిగాలి తప్పకుండా' అన్న శంకరం' ఎక్కడ దిగావు?' అని అడిగితే ఏమని చెప్పాలి?

శంకర్రావు నాకో స్నేహితుడు. ఇద్దరం కలిసి ఒకే ఆఫీసులో కొన్నాళ్ళపాటు పన్జేశాం. ఒకే రూములో కలిసిమెలసి వున్నాం. అప్పట్లో శంకరం ఆర్థిక సమస్యలతో కొద్దిగా ఇబ్బంది పడుతుండే వాడు కుటుంబపరంగా అందువల్ల అప్పుడప్పుడు ఆర్థికంగా ఆదుకునేవాడిని.

'ఒరేయ్ రంగా! నీలాంటి స్నేహితుడు దొరకడం నా అదృష్టంరా' అనేవాడు. తర్వాత వాడు ఉద్యోగ రీత్యా హైదరాబాదు రావడం జరిగింది. పదిహేను రోజుల క్రిందట ఏదో పనిమీద వైజాగ్ వచ్చాడు. బంధువుల ఇంట్లో వుంటున్నానని చెప్పి ఆఫీసులో కలిశాడు. ఏదో చిన్న ఫైనాన్షియల్ ప్రాబ్లమ్ అంటూ ఓ ఐదు వందలు అప్పు కూడా తీసుకున్నాడు. అదుగో అప్పుడే అన్నాడు 'అదేంట్రా రంగా... ఎప్పుడూ ఆఫీసు పనేనా.. సరదాగా నాలుగు రోజులు హైదరాబాదు రాకూడదూ... సరదాగా గడుపుదాం'.

వాడు ఎందుకన్నాడో తెలియదుగాని నాకు నిజంగానే హైదరాబాదు పని పడింది. మా ఆవిడకు చిన్న మెడికల్ టెస్ట్ చేయాల్సిన అవసరం వచ్చింది. అదే చెప్పాను వాడితో. ఓ పది పదిహేను రోజుల్లో హైదరాబాదు రావలసి వుందని.

'తప్పకుండా... మా ఇంట్లోనే దిగాలి సుమా!' అన్నాడు. పోనీలే ఒక సమస్య తీరిందనుకున్నాను. ఎందుకంటే మా ఆవిడా నేనూ ఇద్దరం పల్లెటూరి వాళ్లం కావడంతో మా సర్కిల్ అంతా పల్లెలలోనే... పెద్ద నగరాల్లో మాకు చుట్టాలుగాని, బంధువులు గాని లేకపోవడంవల్ల... మహా నగరాలకు రావడం, తిరగడం అలవాటు లేదు. అందువల్ల ఏ లాడ్జింగు లోనో ఉండాలంటే కొంచెం బెరుకు... భయం ఇద్దరికీను. అందువల్ల 'తప్పకుండా మా ఇంటికి రావాలన్న శంకరం మాటలు నాకు చాలా భరోసా నిచ్చాయ్. మరి ఇప్పుడేమిటి వీడిలా మాట్లాడు తున్నాడు.?

'ఏమిట్రా అలా ఉండిపోయావు... పద... పద కాఫీ తాగుదాం' అంటూ ఫైల్స్ సర్ది లేచాడు.

'లేదురా వెళ్తాను. బయట మా ఆవిడను నిల్చోబెట్టి వచ్చాను'.

'భలేవాడివే మరి చెప్పవేం... పద పద..., అంటూ బయటికొచ్చాడు. మా ఆవిడను పలకరించాడు. 'అన్నట్టు ఏ హాస్పటలన్నావు? నిమ్స్ కదూ! ఇక్కడకు దగ్గరే. దగ్గర్లో మంచి లాడ్జింగ్స్ కూడా ఉన్నాయ్. నో ప్రాబ్లమ్... మీ పని చూసుకున్నాక రేపు మాత్రం తప్పకుండా మా ఇంటికి రావాలి. ఏ లాడ్జిలో దిగావో... దిగిన వెంటనే ఫోన్ చేస్తే నేనొచ్చి పికప్ చేసుకుంటాను' అని వాడు గలగలా మాట్లాడేస్తుంటే 'అబ్బ ఎంత పకడ్బందీగా మమ్మల్ని వదిలించుకొంటున్నాడు' అన్పించింది. 'పాపం ఈ మహానగరంలో వాడికేం ఇబ్బందులో' అన్నది మనసులో మెదలకపోలేదు. కాని... అది నిజం అనుకోవడానికి మనసు ససేమిరా అంగీకరించ లేదు.

వద్దంటున్నా హోటలుకు తీసుకుపోయి కాఫీ పోయించాడు మాకు. తర్వాత వాడే 'నిమ్స్' హాస్పటలుకు ఆటో బేరమాడాడు.

ఎందుకో మనసు అదోలా అయిపోయింది. మనుషులెందుకిలా విచిత్రంగా ప్రవర్తిస్తారు? కడుపులో కల్మషాన్ని దాచుకుని తియ్యగా మాట్లాడుతారెందుకు? సమయానికి తగు మాటలాడి... అన్నట్లుగా వాడు మమ్మల్ని హైదరాబాదు రమ్మనడం... తన ఇంట్లో ఉండ మనడం... కేవలం మాట వరసకు... నా దగ్గర ఐదు వందల అప్పు తీసుకున్నందుకు ఏదో కొండంత

అభిమానం ఉన్నట్లు నటించడానికి మాత్రమే అని నాకిప్పుడు అర్థమయింది.

'అయితే మా కజిన్ ఒకావిడ వుంది సోమాజీ గూడాలో అక్కడికెళ్దాం. అంది మా ఆవిడ.

శంకరం విషయం అర్థమయ్యాక ఇంకెక్కడికి వెళ్లాలన్పించలేదు నాకు. అదే అన్నాను మా ఆవిడతో.

'బావుందండీ... అందరూ ఒక్కలానే ఉంటారా ఏమిటి? అయినా మా కజిన్ పద్మ చాలా మంచిది. చుట్టాలంటే అభిమానం ఎక్కువ. మొన్న ఓ పెళ్లిలో కన్పించి మరీ మరీ చెప్పింది రమ్మని' అని మా ఆవిడ మరీ ఇదిగా చెబుతుంటే,

'సరే పద... ఇదీ చూద్దాం' అన్నాన్నేను. అడ్రసు వెతుక్కుంటూ ఇల్లు చేరాం.

మమ్మల్ని చూసిన వెంటనే... 'అరెఁ... ఏమాశ్చర్యం... కనీసం ఉత్తరమైన రాయలేక పొయ్యారా... స్టేషనుకు బాబునైనా పంపేదాన్ని అడ్రసు సులువుగా దొరికిందా' అంటూ ఆప్యాయంగా పలకరించిందావిడ.

'రండి స్నానాలు చెయ్యండి. బాగా అలసి పోయినట్లున్నారు' అంటూ బాత్‌రూమ్ చూపించింది. 'దేనికీ మొహమాట పడకండి' అంటూ నవ్వుతూ మాక్కావల్సినవి సమకూరుస్తున్న ఆవిడ అభిమానం చూస్తుంటే మండుటెండలో మలయ మారుతంలా అన్పించింది. స్నానాలయ్యాయ్... భోజనాల దగ్గర కొసరి కొసరి వడ్డించిందావిడ. పిల్లలు స్కూలు నుంచి వచ్చారు. మమ్మల్ని పరిచయం చేసింది. 'ఆ రూమ్‌లో రెస్టు తీసుకోండి' అంటూ మాకో రూమ్ ఎలాట్ చేసిందావిడ. 'పిల్లలూ మీరిలా వచ్చి చదువుకోండి... అక్కడ అంకుల్ వాళ్లు రెస్టు తీసుకుంటారని పిల్లలకు చెప్పింది. చిన్న ఇల్లు... చిన్న సంసారం... చక్కటి సంస్కారం... ముచ్చటనిపించింది నాకు.

సాయంకాలం నాలుగయింది మేం లేచేసరికి... ఇంతలో వాళ్లాయన కూడా వచ్చారు. పరిచయాలయ్యాయ్. మాకు కాఫీ టిఫిన్ల ఏర్పాట్లయ్యాయ్. తర్వాత హాస్పిటల్‌కు వెళ్ళాం... టెస్టులు పూర్తయ్యేసరికి ఓ నాలుగు రోజులు పడుతుందన్నారు. నాలుగు రోజులూ వీళ్లింట్లో ఉండటం అంత మర్యాద కాదేమో! ఓ మహానగరంలో నాలుగు రోజులపాటు ఇద్దరు మనుషుల్ని ఇంట్లో పెట్టుకుని మర్యాదలు చెయ్యడమంటే ఇబ్బందికరమే. అందుకనీ 'మేమెక్కడయినా హోటల్‌లో ఉంటామండీ' అన్నాను మొహమాటంగా మా ఆవిడ కజిన్ పద్మగారితో.

'భలేవారే... హోటల్ ఎందుకు? మేముండగా... ఏదో నాలుగు రోజులు మీరున్నంత మాత్రాన మాకు తరిగి పోయేదేంలేదు. మొహమాట పడకండి. ఏదో మా చెల్లెలొచ్చింది సరదాగా నాలుగు రోజులు గడుపుదామంటే మీరేమిటండీ బాబూ! అంతగా మీకిష్టం లేకపోతే మీరెళ్లిపోండి హోటలుకు' హాస్యంగా నవ్వుతూ అన్నా అతి చనువు తీసుకుంటున్నానని అన్పించేదేమో మళ్లీ వెంటనే అంది.

'ఏమీ అనుకోకండి. సరదాగా అన్నాను. అయినా మా చెల్లాయి ఇక్కడుంటే వదిలి మీరెక్కడికి వెళ్తారు లెండి' అంటున్న ఆవిడ ఆప్యాయతకూ, అభిమానానికీ ముగ్ధుణ్నయ్యాను. పిల్లలు కలివిడిగా చిన్నాన్న, పిన్ని అంటూ సరదాగా ఉన్నారు. వాళ్లాయన కూడా బాగానే మాట్లాడుతున్నారు.

మొత్తానికి హైదరాబాదులో ఉన్న నాలుగు రోజులూ వాళ్లింట్లోనే గడిపేశాం. అంతకు ముందు 'పద్మ' గారితో నాకసలు పరిచయం లేకపోయినా ఎన్నాళ్లో పరిచయమున్నట్టుగానే... స్వంత వదినో... అక్కో అన్నట్లుగానే గడిచిపోయింది. పద్మగారి అభిమానం, ఆప్యాయత నా గుండెల్లో చెరగని ముద్ర వేశాయ్.

□□□

చాలా రోజుల తర్వాత ఓ పెళ్లిలో కలిశాం.

'మొత్తానికి భలే పనిచేశావయ్యా బాబూ! అసలు నువ్వు రచయితవని తెలిస్తే మా ఇంటికే రానివ్వకపోదును' అభిమానంగా అందావిడ.

'నేనేం చేశాను వదినా!' మొదటిసారి వదినా అని పిలిచినా కొత్తగా అన్పించలేదు నాకు. ఎందుకంటే ఆవిడ చూపిన అభిమానం, ఆప్యాయత ఎప్పుడో కొత్తను దూరం చేశాయ్.


'ఇంకేం చెయ్యాలి నా మీదే కథ రాశావు కదా!'

'ఏదో కృతజ్ఞత... ఇలాగైనా మీ ఋణం తీర్చుకుందామని'

'నువ్వు ఋణం తీర్చుకోవడం మాట అటుంచు. నేను ఋణగ్రస్తురాల్నయ్యానేమో అన్పిస్తుంది'.

'అదేమిటొదినా!'

'కాదా మరి! పూర్వం రాజులు తమ మీద కవిత్వం రాయించు కోవాలంటే మడులు మాన్యాలు... ధనరాశులు ఇచ్చి రాయించుకునే వారట. అలాంటిదేమీ లేకుండా నాలుగు రోజులు నాలుగు పచ్చడి మెతుకులు వడ్డించి నామీద కవిత్వం రాయించుకున్నాను. మరి ఋణగ్రస్తురాల్ని కాదా! కాని నాకు ఒక్కటే బాధగా




వుందయ్యా... కవిత్వం చీప్ అయిపోయిందని'.

'లేదొదినా... కవిత్వం చీప్ అవలేదు. మంచితనం, మానవత్వం ప్రియమయిపోయాయ్. ధనరాశులు, మడులు, మాన్యాల కంటే మంచితనం, మానవత్వం ఖరీదయిపోయాయ్. అందుకని అవి దొరుకుతాయంటే చాలు కవిత్వం వెల్లువలా పొంగుతుంది... వరదలై ప్రవహిస్తుంది' అని నేను భావావేశంతో చెబుతుంటే....

'చాల్లేవయ్యా... లేనిపోని గొప్పలు చెబుతూ ఎక్కడో ఎక్కించేశావ్. ఇప్పుడక్కడ నుంచి దిగడానికి మనసొప్పడం లేదు. ఆ స్థానాన్ని కాపాడుకోవడానికి ఎన్ని తిప్పలు పడాలో' అంటున్న పద్మ వదిన కళ్లల్లోని సంతృప్తిని చూశాక ఆవిడిచ్చిన ఇన్స్పిరేషన్‌తో 'ఆతిథ్యం' అన్న కథ రాసి ఆవిడపట్ల సరయిన కృతజ్ఞతనే చూపుకున్నాననే సంతృప్తి నాకు మిగిలింది. ●